సంఘజీవి

మంచి కబురు గానివ్వండి, చెడు కబురు గానివ్వండి, పెదవి దాటిన తర్వాత అది పెన్నునే లంఘించగలదంటారు. పెన్నునే దాట గలిగినప్పుడు కమలాకరంద్వారా పద్మావతికి తెలిసి, పద్మావతిద్వారా ఎదురింటి సుందరమ్మక్కకు, ప్రక్క యింటి పార్వతమ్మ పిన్నికి తెలిసిన కబురు వాయువేగంతో చిలవలు పలవలుగా వీధి వీధంతా అల్లుకపోవడంలో ఆశ్చర్యమేముంది?

వీనుల విందుగా ఒక పాటను వినిపించి, ఆ పాటకు అనుబంధంగా తలనొప్పిమందు కొనుక్కోమని హితవుజెప్పే సిలోను రేడియో ప్రసారంలాంటి ప్రచారం ఎదిరింటి సుందరమ్మక్కది! "విన్నావా రంగమ్మత్తా! మరీ... పద్మావతికట, పది పదిహేనురోజుల్లో ఒక వంటలక్క అత్యవసరమట! ఎందుకూ అనండి! అదేం ప్రశ్నండీ, వచ్చే అతిథులకు కాఫీలు, ఫలహారాలు ఆఫీసు గదిలోకి సరఫరా చేయిస్తూ, వాళ్ళకు లభ్యం కావలసిన ఆదరణ మర్యాదలో ఎలాటి లోపమూ జరక్కుండా చూసుకోవలసిన బాధ్యత తన భుజాలపైన వుండగా, ఆవిడ వంటగదిలో గంజి వార్చుతూ కూచుంటే ఎలా జరుగుతుందండీ, మీ పిచ్చిగానీ! ఆ వచ్చే అతిథీ తాశీల్దారుగావచ్చు, లేదా ఏ పంచాయతీబోర్డు ప్రెసిడెంటో కావచ్చు, అదీ కాదంటావా ఎం.ఎల్.ఏగారి బావమరిదికి తోడల్లుడి ప్రేలు విడిచిన మేనల్లుడైనా గావచ్చు" అంటూ ఆమె ప్రతీవాక్యం చివరా ఏ సింధుభైరవో, ఏ అఠాణానో, లేదా ఏ హిందూస్థానీ కాఫీయో ఆలాపించి, చిట్టచివర "విషయమేమిటంటే రంగమ్మత్తగారూ! ఆవిడ భర్తగారికి ప్రమోషను రాబోతున్నదట! 'అట' ఏమిటండీ అపశకునంలాగా! వచ్చేసినట్టే లెక్కట!" అంటూ అసలు సంగతికి రంగులు పూసి, మెరుగులుదిద్ది గాలిలోకి వదిలేసింది.

నలుగురైదుగురు బిడ్డలతో వేగుతూ, తాలూకాఫీసులో పనిచేస్తున్న భర్తకూ, మరిదికీ వేళకు సరిగా వంటలూ, వడ్డనలూ నిర్వర్తింపవలసి వున్న సుందరమ్మకంటే ప్రక్క యింటి పార్వతమ్మ పిన్ని బాగా తీరుబడివున్న మనిషి! కొడుకులూ, కోడళ్ళూ కాపురం చక్కబెట్టుకుంటూ వుండగా, యిక సంసారంతో మనకేంపని అన్నట్లు నాళంవారి వీధిలో ఈ కొసనుంచీ ఆ కొసదాకా దిగిన కడప ఎక్కకుండా ప్రతి యింటికీ వెళ్ళిరావడం ఆమె అనుదిన కార్యక్రమం. పోస్టుమేన్ పొరుగూళ్ళనుంచి వచ్చిన ఉత్తరాల్ని ఎవరివి వాళ్లకు అప్పజెప్పుతాడు, పార్వతమ్మ స్థానిక వార్తల్ని యింటింటికీ చేరవేస్తుంది. కాదంటే ఒక చిన్న తేడా లేకపోలేదు. అతడు కొలువుచేసేది రూకలకు! ఈమె యిల్లిల్లూ తిరిగేది ప్రొద్దుపోకడకు!

"ఐనా అదృష్టమంటే అలా వుండాలి."

పార్వతమ్మచేత అదృష్టంగా భావింపబడుతున్నదేది? ఆ అదృష్టం యిప్పుడెవర్ని వరించింది? అన్న ప్రశ్నలకు జవాబుకోసం ఎదుటివాళ్లు తనవైపు కుతూహలంతో చూస్తుంటే, వాళ్ళల్లో ఉత్కంఠ రగులుకోడానికి నాలుగైదు క్షణాలు తెరపియిచ్చి మళ్ళీ ప్రారంభించేది పార్వతమ్మ.

"ఉద్యోగంలో చేరి అయిదారేళ్ళయినా కాలేదు, అప్పుడే ప్రమోషనా! అందులోనూ ఆ డిపార్టుమెంటులో వినడానికే అబ్బురంగా వుంది. గుమస్తాగా వున్నంతకాలం అతడు సైకిలుతోనే సరిపెట్టుకున్నాడనుకో! కానీ యిక మీదట ఆఫీసరు హోదాకు, సైకిలుకు ఎక్కడి కెక్కడి చెప్పు! అందుకని కమలాకరం సైకిలమ్మేసి మోటారు సైకిలు కొనుక్కోబోతున్నాడట! ఇక రేడియో కొనడమేమో తప్పనిసరి! అంతేనా! ఇంట్లో టెలిఫోను లేకపోతే క్షణం సాగుతుందా పిన్నిగారూ అంది పద్మావతి! అవును మరి! ఎలా సాగుతుంది? భర్త ఆఫీసులో కూచుని 'అలోమదీరా' అంటే, యిటు యింట్లోనుంచీ ఈవిడ..."

"అలో మదీరా ఏమిటండీ పిన్నిగారూ, మక్కామదీనాలాగా! 'హలో మైడియర్' అనాలి."

"అదేమిటోనమ్మా, ఆ చోద్యాలు నాకేం తెలుస్తాయి?" అంటూ అమాయకత్వం ప్రకటించి ప్రమోషను రాగానే కమలాకరం యింట్లో తీసుకరానున్న మార్పుల్ని గురించి తను పద్మావతిని వుబుకించి తెలుసుకున్న విషయాలన్నింటినీ ఏకరువు పెట్టసాగేది పార్వతమ్మ.

విస్తృతరంగంలో, విరివిగా కొనసాగుతున్న ఈ ప్రచారంవల్ల కలిగిన సద్యఃఫలితాలు యిటు పద్మావతికీ, అటు కమలాకరానికీ అమందానందాన్నే కలిగించాయి. వీధిలో ఎదురైనప్పటికీ పెదవి కదిపి పలకరించడమే బ్రహ్మాండమైన రిటయిర్డు సబ్‌కలెక్టరు రాజాద్రిరావు నాయుడుగారు, కమలాకరం ఆఫీసుకు వెళ్తుండగా కిటికీలోనుంచీ చూచి "ఏమిటోయ్ కమలాకరం ఈ మధ్య కనిపించడమే మానేశావే! తీరికైనప్పుడు యిలా రాగూడదూ! ఏదైనా మాట్లాడుతూ కూచోవచ్చు. ప్రొద్దుపోయి చావడం లేదయ్యా పాడూ!" అన్నాడు. అదే వీధిలో కాపురముంటున్న డిప్యూటీ తాశీల్దారు చిదానందం, సైకిలుపైన వెళ్తున్నవాడు కమలాకరం యింటిముందర ఆగి, ఏమండోయ్ కమలాకరంగారూ! పైవారం క్లబ్బు కార్యవర్గాన్ని కొత్తగా ఎన్నుకోబోతున్నారన్న సంగతి మీకు తెలుసుగదూ! నా మట్టుకు నేను రెండేళ్ళు సెక్రెటరీగా పనిచేశాను. నా తల బొప్పికట్టింది. మీ కభ్యంతరం లేకపోతే నేను సెక్రెటరీగా మీపేరు ప్రతిపాదింపదలచుకుంటున్నాను. ఏమంటారు? అన్నాడు. ఎన్నడూ లేనిది, ఎదురింటి శ్రీమన్నారాయణ పండుగా పబ్బమూగానీ మామూలు రోజున కమలాకరాన్ని భార్యాసహితంగా తీసుకెళ్ళి విస్తరి వరహాచేసే విందు భోజనం పెట్టాడు!

కమలాకరానికి ఆశ్చర్యం కలిగింది! ఐతే తన హోదా రిటయిర్డు సబ్‌కలెక్టరుతో బాతాఖానీ వేయడానికి తగినంతవరకూ పెరిగిందన్నమాట! రిక్రియేషన్ క్లబ్బుకు కార్యదర్శిత్వం నెరప గలిగినంతవరకూ పెరిగిందన్నమాట! లోలోపల అసూయవున్నా, ఎదుటివాడు తనను తప్పనిసరిగానయినా గౌరవించక తీరనంతవరకూ పెరిగినదన్నమాట!

'ధన్యోస్మి, ధన్యోస్మి' అనుకోబోయాడు కమలాకరం!

'ఆ ప్రమోషను కాస్తా వచ్చేంతవరకూ ఆగకూడదటయ్యా' అంది అంతరాత్మ.

'పోనీ, అలాగేలే! ఇప్పుడేం తొందర' అనుకున్నాడు కమలాకరం.

గాలిలో తేలిపోతూ కమలాకరం యింట్లో ప్రవేశించేసరికి, పద్మావతి ద్వార బంధాలకు ఎలాటి తెరలు వ్రేలాడదీయాలన్న తలపోతలో లీనమైవుంది. ఆమె ఆలోచనకు అంతరాయం కలిగించడమెందుకని కమలాకరం నిశ్శబ్దంగా కుర్చీలో కూర్చున్నాడు.

అర్ధనిమీలిత నేత్రాలతో, గోడకానుకుని ఆలోచిస్తూ నిల్చున్న పద్మావతి పెదవులపైన శుక్ల పంచమినాటి లేత వెన్నెల్లా ఓ హాసరేఖ మెరసిపోతూ వుండడం కమలాకరానికి కనిపించింది. కారణమేమిటా అని అతడూ ఆలోచిస్తూనే వున్నాడు. ఇంతలో పద్మావతి వున్నట్టుండి పక్కున నవ్వనే నవ్వేసింది!

"ఏమిటి పద్మా?" అన్నాడు కమలాకరం.

పద్మావతి ఉలికిపడి "మీరెప్పుడొచ్చారు?" అంది.

"నేనిప్పుడే వచ్చానుగానీ, నువ్వెందుకు నవ్వావో చెప్పవూ" అన్నాడు కమలాకరం.

"అదిగాదండీ! లోకపు తీరును తలచుకుంటే ఎవరికైనా నవ్వేవస్తుంది."

"ఆ లోకపు తీరెలాటిదో నన్నూ తెలుసుకోనివ్వు మరి!"

"ప్రక్కింటి సరోజమ్మ వుందిగదండీ! ఆవిడ పుట్టింటినుంచీ వస్తూ ఓ డిజైన్ల పుస్తకం పట్టుకొచ్చింది. 'ఈ పుస్తకాన్ని తీసుకెళ్తాను సరోజా! ఒకటి రెండు డిజైన్‌లు కాపీ చేసుకుని మళ్ళీ ఇచ్చేస్తాను' అన్నాను. 'రేపు తీసుకెళ్దువులే, మాపు తీసుకెళ్దువులే' అంటూ నాలుగైదురోజులు జరిపేసింది. ఆ తరువాత నేనడగడం మానుకున్నాను. ఈరోజు ఉదయం ఆవిడ వచ్చి 'మరే మనుకోకు వదినా! ప్రక్క వీధిలో ఎవరో ఈ పుస్తకాన్ని తీసుకెళ్ళి ఇప్పుడే తెచ్చి యిచ్చారు. అవసరమున్నంతవరకూ దీన్ని నీ దగ్గరే వుంచుకో' అని చెప్పి వెళ్లింది."

"ఇందులో నవ్వడానికేముంది పద్మా?"

"లేకేం; వుంది! నేను ప్రతిరోజూ ఆ సరోజమ్మ కూతుర్ని అడిగి తెలుసుకుంటూనే వున్నాను. ఆ పిల్ల 'పుస్తకం అలమారాలో వుందత్తయ్యా! నేనిప్పుడుగూడా చూచాను' అంటుంది. ఆ అయిదేళ్ళ పిల్లకింకా అబద్ధాలు అలవాటుకాలేదు కదండీ మరి!" అంటూ మళ్ళీ నవ్వేసింది పద్మావతి.

"ఐతే నువ్వికమీదట ఏ వస్తువుకోసంగానీ యిరుగింటి వాళ్ళనీ, పొరుగింటి వాళ్ళనీ, ప్రాధేయపడవలసిన అవసరం లేదేమో పద్మా! కాకితో కబురంపినా వాళ్ళే స్వయంగా తెచ్చి యివ్వగలరనుకుంటాను" అన్నాడు ఇంచుక విస్మయంతో కమలాకరం.

"కానీ ప్రపంచకంలో అందరూ సరోజమ్మలాంటి భోళా మనుషులే వున్నారటండీ! అబ్బో, నోటితో మాట్లాడుతూ నొసలితో వెక్కిరించే వాళ్లెంతమంది? కొళాయి దగ్గర నుంచీ నేను నీళ్ళు తెచ్చుకుంటున్నప్పుడు చూడాలి వీళ్ళ ముఖాలు! కత్తివేటుకు నెత్తురు చుక్క కనిపించదనుకోండి! అవలా పాలిపోవడం ఎందుకంటారు?"

"అసూయ పద్మా అసూయ!" అన్నాడు కమలాకరం! "ఐతే 'అసూయ' అనేది ఎదుటి వాళ్లని హింసించే ఆయుధంగా ఎన్నడూ ఉపకరించలేదు. అది ఎవరికి వాళ్ళనే చెడదినే వ్యాధి. అందుకు నువ్వు మరేం బెంగపెట్టుకోకు పద్మా! కుళ్ళే వాళ్ళ ముందరే కులకాలన్నారు..."

***

జీవితం మానవు డాశించినంత సాఫీగానే గనుక జరిగిపోతే ఆ తరువాత లోకంలో కథలకు అభావమేనేమో అనిపిస్తుంది.

ఇదెంతవరకూ నిజమోగానీ కమలాకరం ఆశించినట్టుగా అతనికి పదిరోజుల్లో ప్రమోషనే గనుక లభ్యమై వుండినట్టయితే, ఇప్పుడిక్కడ కథంటూ ఒకటి సంభవించడానికి ఆస్కారమే లేదు.

కమలాకరానికి ప్రమోషను రాలేదు!

ఆఫీసులో ఏర్పడిన ఖాళీకి కమలాకరాన్ని ప్రమోట్ చేయడానికి బదులు, మరొకచోటునుంచి ఒక ఉద్యోగిని ఆ స్థానానికి బదిలీ చేశారు.

ఆఫీసరుగారు కమలాకరాన్ని తన గదిలోకి పిలిపించి "మనలాంటి ఉద్యోగులు ఆశాభంగానికి తట్టుకోవలసివుంటుంది కమలాకరం! కానీ నువ్విందుకు పెద్దగా విచారం పెట్టుకోవలసిన అవసరంలేదు. కాళ్ళకు చుట్టుకున్న పాము కరవక మానదు! నీ పేరు లిస్టులో వుంది. ఎప్పుడో నీకు తప్పకుండా ప్రమోషను వస్తుంది" అన్నారు.

సూర్యాస్తమయం తర్వాత చెన్నుదొరగిన పద్మాకరంలా ఆ వార్త విన్న కమలాకరం ముఖం చిన్నబోయింది.

"ఏ ముఖం పెట్టుకుని నేను పద్మావతిని చూడను" అని లోలోపలే బిట్టు వాపోయాడు కమలాకరం.

కానీ ముఖం తప్పించుకుని తిరగడానికి మరొకరూ, మరొకరూ గాదు! స్వయానా అర్ధాంగి! సాయంత్రం ఎనిమిది గంటలకైనా యింటికి వెళ్ళక తప్పలేదు కమలాకరానికి!

"ఈయన యుద్ధంలో ఓడిపోయి వచ్చిన సేనానిలా వున్నారేమో?" అనుకుంది పద్మావతి.

కొండ కొమ్ముమీద నిలబెట్టిన పద్మావతిని హఠాత్తుగా లోయలోకి తోసివేయ లేకపోయాడు కమలాకరం. చేతిని పట్టుకుని నిండు చెరువులోకి తీసుకెళ్ళినట్లు ఆమెను నిరాశలోకి మెల్లమెల్లగా నడిపించుకుని వెళ్ళాడు. అందుచేత అసలు విషయాన్ని వివరించి చెప్పడానికి అరగంటసేపు పట్టింది.

ఈ అరగంటసేపట్లో పద్మావతి ముఖాన కృష్ణపక్షం కళలు మార్చుకుంది. చిట్టచివర అక్కడ నిండు అమావాస్య నెల నాటుకపోయింది.

వేదనలతో, వేడి నిట్టూర్పులతో భార్యాభర్తల కా రాత్రి గడచిపోయింది.

తెల్లవారుజామున కాసేపు నిద్రపోయి లేచిన తర్వాత వాళ్ల కా వేదన కాస్తా వుపశమించినట్లే కనిపించింది.

కానీ పుండుపైన కారం చల్లడానికి సంఘమంటూ ఒకటి తమ చుట్టూ వున్నదన్న సంగతి వాళ్లకప్పటికి అంత స్పష్టంగా తెలియదు. ఒకవేళ తెలిసినా, 'బాధలో బాధ! దాని లెక్కేమిటి!' అనే వాళ్ళు తలపోశారు.

కానీ పుండువల్ల కలిగే బాధకంటే, దానిపైన కారం చల్లడంవల్ల కలిగే బాధే దుర్భరమన్న సంగతి ఆకళించుకోడానికి వాళ్లకెంతో కాలం పట్టలేదు.

ప్రమోషను రాబోతున్నదన్న విషయానికి మల్లెనే, అది రాలేదన్న విషయాన్నిగూడా మున్ముందుగా పసిగట్టి, పనిగట్టుకుని ఆ వార్తను ప్రచారం చేసిపెట్టిన ఘనత మళ్ళీ ఎదురింటి సుందరమ్మకు, ప్రక్క యింటి పార్వతమ్మకే దక్కింది.

పదకొండు గంటలకు కమలాకరం భోజనంచేసి ఆఫీసుకు వెళ్ళిపోయిన తర్వాత, పద్మావతి చాపమీద పడుకుని ఏదో చదువుకోడానికి ఉద్యమిస్తుండగా "ఏమిటమ్మోవ్ పద్మావతీ! ఏవైనా డిటెక్టివ్ నవలలున్నాయా?" అంటూ లోపలికి వచ్చింది సుహాసిని. సుహాసిని చిదానందంగారి భార్య.

పద్మావతి తెల్లబోయి "అబ్బే, నేను డిటెక్టివ్ నవలలు చదవను గదండీ!" అంది.

"పోనీగానీ మీకు వంటలక్కతో అవసరముందన్నావట! సుందరమ్మ చెప్పింది. నా ఎరుకలో ఒకావిడ ఎక్కడైనా పని చూపించమని వేధించుక తింటోంది. మీకు కావలసి వస్తే రేపటినుంచే ఏర్పాటు చేస్తాను."

"అబ్బే, మాకు వంటలక్క ఎందుకండీ?" మోకాళ్లమీద తలానించుకుని చాపపైన గీత గీస్తూ అంది పద్మావతి.

"ఏమోలే! ఒక మాటడిగి చెబుతానన్నాను. ఐతే డిటెక్టివ్ నవలలు లేవన్నావు గదూ! వెళ్తాను మరి. ఎలాగూ రేడియో వుంది గదా! వింటూ కూచుంటాను."

వెళ్ళిపోతున్న సుహాసినిని చూస్తూ అలాగే బొమ్మలా కూర్చుండిపోయింది పద్మావతి. ఈమె తనను వెదుక్కుంటూ వచ్చింది నిజంగా డిటెక్టివ్ నవలలకోసమేనా! కాదు. తను అలాటి నవలలు చదవదని ఈమెకు రూఢిగా తెలుసు. ఈమె వచ్చింది - ఒకటి, నీది వంటలక్కను పెట్టుకునే ముఖమేనా అని దెప్పి పొడవడానికి - రెండు, తమకు రేడియో వుందన్న విషయం తనకు జ్ఞాపకం చేయడానికి!

ఆ రోజు రాత్రి పదిగంటలప్పుడు ఎవరో తలుపు తట్టుతూ వుండడం విని, కమలాకరం గబగబా వెళ్ళి తలుపు తీశాడు.

మెట్లమీద నిల్చున్న యువకుడు "నేను అత్యవసరంగా గుంటూరులోవున్న మా బంధువులతో మాట్లాడాలిసార్! మీ యింట్లో ఫోన్ వుంది గదండీ!" అన్నాడు.

"మేము ఫోను పెట్టించుకోలేదండీ!" అన్నాడు కమలాకరం.

"అలాగా! మన్నించండి సార్! ఎవరో రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చారు" అంటూ అతడు తల వంచుకుని చరచరా వెళ్ళిపోయాడు.

అతడిలా అడిగినందుకే కాదుగానీ, ఈ దృశ్యాన్ని ఎదురింటి శ్రీమన్నారాయణ కిటికీలోంచి చూస్తున్నందుకు నిలువునా కృంగిపోయాడు కమలాకరం.

అంతటితో ఏమైంది? నాలుగునాళ్లు గడిచిపోయిన తర్వాత ఓరోజు సాయంత్రం ఆరుగంటలకు ఓ కంపెనీ ఏజంటు మోటార్ సైకిలుపైన హుటాహుటిగా వచ్చి కమలాకరంతో భేటీ అయ్యాడు. ఏమిటి, ఎందుకు ప్రశ్నిస్తూ వుండగానే అతడు కమలాకరాన్ని వీధిలోకి లాక్కొచ్చి "చూచారా సార్! ఇది సైకిలు, ఎంత గంభీరంగా వుందో చూచారా! కొనుగోలుదార్ల సౌకర్యార్థం ఉగాది పండుగ దాకా 10% తగ్గించాము. పెట్రోలు ఖర్చు చాలా తక్కువ. మీరు సైకిల్లో వెళ్తున్నట్టు వుండదు. రెక్కలు గట్టుకుని గాలిలో పరతెంచినట్టుంటుంది. అందుకే మన తెలుగుదేశానికి సంబంధించినంతవరకూ దీనికి 'పంచకళ్యాణి' అని పేరు మార్చాలనుకుంటున్నాము" అంటూ ఉపన్యాసం ప్రారంభించాడు.

సదరు ఉపన్యాసాన్ని వినడానికీ, సైకిల్ను చూడడానికీ, దోషిలా నిల్చున్న కమలాకరాన్ని చూపుల తూపులతో గ్రుచ్చడానికి అక్కడొక గుంపు ప్రోగైంది.

పబ్లికు ప్రాసిక్యూటరుకు మల్లే గడగడా వాగేస్తున్న ఆ ఏజంటు కద్దుతగిలి, ఓ పెద్దమనిషి నేరస్థుని తరఫున వకాలత్తు పుచ్చుకున్న న్యాయవాదికి మల్లే "ఈయన మోటర్ సైకిలు కొనదలచుకున్నమాట నిజమేనండీ! కానీ పరిస్థితులు అనుకూలించలేదు. అందువల్ల ప్రస్తుతం దీన్ని బేరమాడే ప్రసక్తే లేదు. మీరు సెలవు తీసుకోవచ్చు" అని నచ్చచెప్పాడు. 'ఓస్, యింతేనా!' అన్నట్టు ఏజంటు కమలాకరాన్ని ఒకటి రెండుసార్లు ఎగాదిగా చూచి, చెవులు జాడించుకుని సైకిలు పైకెక్కి వెనుదిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి పడుకోడానికి ముందుగా వాలు కుర్చీలో మేనువాల్చి పైకప్పుకేసి చూస్తూ, "అబ్బబ్బ, ఈ లోకుల కంటే యినుప ముక్కల కాకులే నయం!" అన్నాడు కమలాకరం.

"మెల్లగా అంటున్నారా ఆ మాట! వీధిలో తల చూపించలేకపోతున్నానంటే నమ్మండి. బాబ్బాబూ! మీకు పుణ్యముంటుంది. రెండు మాసాలు సెలవు పెట్టేయండి! మనం వూరికి వెళ్ళిపోదాం" అంది పద్మావతి.

సమయానికంత మంచి సలహా యిచ్చినందుకు భార్యను కృతజ్ఞతాప్లావితమయిన చూపులతో అభిషేకించి, మౌనంగానే అభినందించుకున్నాడు కమలాకరం!

కాలచక్ర పరిభ్రమణంలో రెండు నెలలంటే ఎంత? చూస్తూ చూస్తూ వుండగానే ఆరేడు వారాలు యిట్టే దొర్లిపోయాయి. కమలాకరం మళ్ళీ ఉద్యోగ బాధ్యతల్ని స్వీకరించడానికి ఇంక రెండుమూడు రోజులకంటే వ్యవధి లేదు.

"అదేమిటి పద్మా! నీ వాలకం చూస్తుంటే నువ్విప్పుడు నాతో బయల్దేరే వుద్దేశంతో వున్నట్టు లేవే!" అన్నాడు కమలాకరం.

పద్మావతి కాసేపు గుణిసి "నే నా యింట్లో కాపురం చేయలేనండీ" అంది.

"అయ్యయ్యో, అదేం మాట పద్మా! ఆ ఇంట్లో అత్తమామల ఆరడి, ఆడబిడ్డల పోరు వున్నట్లు మాట్లాడుతావేమిటి! ఇంకా ఆ వీధిలో కాపురం చేయలేనని చెప్పు, ఒప్పుకుంటాను."

"అదేనండీ అదే! నేనిలా చెప్పబోయి అలా చెప్పేశాను."

"ఇంతకూ ఇప్పుడేం చేయాలో అది మాత్రం చెప్పవు!"

"ఇంకేం చేయగలమండీ! యిల్లు మార్చేయాలి"

"రైటో! సలహా చెబుతే నువ్వే చెప్పాలి పద్మా; నేనూ ఆలోచిస్తున్నాను..."

"తరువాత తీరిగ్గా పొగడవచ్చుగానీ, మీరు క్రొత్తగా చూడబోతున్న యిల్లు నాళంవారి వీధికి ఒక మైలు దరిదాపులో వుండగూడదు."

"అలాగే, అలాగే" కృతనిశ్చయంతో అన్నాడు కమలాకరం.

నగరారణ్యాల్లో అద్దె కొంపకోసం వేటాడే విద్యలో ఓనమాలైనా రానివ్యక్తి కమలాకరం. కానీ ఆ విద్యలో ఘటికుడైన ఓ మిత్రుని తోడ్పాటువల్ల కమలాకరానికి పట్టణంనుంచీ విసిరివేయబడినట్టున్న ఓ మారుమూల పేటలో ప్రాకారకుడ్యమూ, చిన్న పూలతోట, వంటగది, బాత్‌రూమూగాక మూడుగదులూ, ఓ హాలు వరండాలతో చిన్న బంగళాలా వున్న యిల్లొకటి కుదిరింది.

కార్డు ముక్క చేరగానే, ఫోర్డు కంపెనీవారి కారులా పరతెంచి వచ్చిన పద్మావతి ఆ యింటిని చూసి మురిసిపోయింది.

"ఎంత బాగుందండీ! చాలా బాగుంది. చేద బావి గూడా యింట్లోనే! కొళాయి గిళాయి అంటూ వీధిలో బడిగాపులు పడవలసిన అవసరమే లేదు. నేను పది గంటలకల్లా వంట ముగించేస్తాను. మీరు భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళండి. నేను తలుపు గడియవేసుకుని ఏవైనా పుస్తకాలు చదువుకుంటాను. లేదా లేసులు అల్లుకుంటాను. అదీకాదంటే కాసేపు నిద్రపోతాను. మీరు అయిదుగంటలకల్లా యింటికొచ్చేస్తారు. కాఫీ తీసుకున్న తర్వాత మనం ఊరిబయటగా షికారెళ్దాము. రాత్రి భోజనమైన తర్వాత, వెన్నెల రాత్రయితే హాయిగా ఆకాశంలోకి చూస్తూ కూర్చోడానికి, ఎలాగూ డాబా వుండనే వున్నది. ఈ యింట్లో మనం తిన్నా, తినకపోయినా అడిగేవాళ్లు లేరు..."

"నీకూ నీవారు లేరు, నాకూ నావారు లేరు... ఛల్ మోహనరంగ! అని పాటను సవరించుకోడం లెస్స" అన్నాడు కమలాకరం నవ్వుతూ.

పద్మావతి వరండాలో నిలబడి ఆ వీధివైపు చూసింది. ఇది నాళంవారి వీధిలా లేదు. ఇండ్లు అక్కడొకటీ, యిక్కడొకటీ చెల్లాచెదరుగా వున్నాయి. కానీ ఈ ఎదురింట్లో ఒక సుందరమ్మక్క, ప్రక్క యింట్లో ఒక పార్వతమ్మ పిన్ని, ఆ పెంకుటింట్లో ఒక సుహాసిని వుండరనుకోడానికి వీల్లేదు. ఈ అమ్మలక్కలు మొదట మొదట ఎంతో ఆప్యాయతగా స్నేహానికి రాదీస్తారు. ముక్కు నొచ్చినా ముఖం వాసినా పరామర్శల వర్షం కురిపించి, ఆత్మీయతను ఒలకబోస్తారు. దినాలు గడిచినకొద్దీ వీళ్ళ అసలు బండారం బయట పడుతుంది. బాబూ! వీళ్ళకొక నమస్కారం. ఇందాకా జరిగిన శాస్తి చాలు!

"ఏమిటి పద్మా! చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నావు?" అన్నాడు కమలాకరం.

"అబ్బే ఏముంది? వీళ్ళ కందరికీ మనం బోనులో పడనున్న కొత్త జంతువులకు మల్లే కనిపిస్తున్నామేమో! అప్పుడే కిటికీలు తెరచుకుని మనల్ని చూడ్డానికి సిద్ధమయ్యారు. అమ్మో! వీళ్ళ ఆటలు నా దగ్గరేం సాగవు! మీరు లోపలికి వచ్చేయండి" అంటూ పద్మావతి బిరబిరా లోపలికి వెళ్ళిపోయింది.

కమలాకరం తెల్లబోయి "అదేమిటి పద్మా! వీళ్ళపైన కక్ష గట్టినట్లు మాట్లాడేస్తున్నావు?" అన్నాడు.

నా బాధ మీకేం తెలుసునన్నట్లు పద్మావతి భర్త వైపు అదోమాదిరిగా చూసింది.

పోనీలే, నాకెందుకు లెమ్మనుకున్నాడు కమలాకరం.

కానీ పద్మావతి చిత్త ప్రవృత్తిలో వస్తున్న ఈ చిత్రమైన మార్పుయొక్క విశ్వరూపాన్ని గమనించినకొద్దీ కమలాకరం మాటిమాటికీ విస్తుపోవలసి వచ్చింది.

"ఇంతకు మునుపు ఎక్కడుండే వారమ్మాయ్?" అని ఎదురింటావిడ ప్రశ్నిస్తే, పద్మావతి "అదేమిటండీ! అలా అడుగుతున్నారు. మనుషులన్న తర్వాత ఊళ్ళో వుండక అడివిలో వుంటారా" అని సమాధానమిచ్చింది.

"మీవారి ఉద్యోగమేమిటండీ?" అని ఎవరో అడిగితే "ఉదరపోషణకే ఉద్యోగమైతే ఏమిటండీ! ఏదో ఒకటి" అంటూ పుల్లవిరిచినట్లు బదులు చెప్పింది.

"ఏమిటమ్మోవ్! కాస్తా తలుపు తెరవగూడదూ? ఎంతసేపూ నాలుగు గోడలమధ్య ఖైదీలా కూర్చుంటావెందుకూ?" అంటూ గడపదాకా వచ్చిన వాళ్ళని "ఒంట్లో ఏమీ బాగుండడం లేదండీ! డాక్టరుగారు విశేషంగా మాట్లాడగూడదన్నారు" అని చల్లగా సాగనంపింది.

"నిష్కారణంగా వీళ్ళతో విరోధం కొని తెచ్చుకుంటున్నామేమో పద్మా!" ఓరోజు కమలాకరం బాధగా అన్నాడు.

"వీళ్ళతో స్నేహంగా వుంటే మనకు ఒరిగేదేమిటి, లేకుంటే తరిగేదేమిటి? మనం ఈ యింటికి కాపురమొచ్చి ఒక నెలరోజులవుతాయి గదా! వీళ్ళకు మనం యింతకు మునుపు ఎక్కడుండే వాళ్ళమో తెలియదు. మీరు చేస్తున్న ఉద్యోగమేమిటో తెలియదు. అసలు నాపేరేమిటో తెలియదంటే నమ్మండి తెలుసుకోవాలన్న కుతూహలం వున్నప్పటికీ నన్ను ప్రశ్నించడానికి వీళ్ళకు గుండెల్లేవు. నేను పెడసరంగా తప్ప మరొక విధంగా బదులు చెప్పనన్న సంగతి వీళ్లకు బాగా తెలిసిపోయింది. నా కిప్పుడెంతో హాయిగా వుంది" అంటూ పద్మావతి విజయగర్వంతో నవ్వింది.

కానీ జీవితం ఎల్లకాలమూ హాయిగానే గడచిపోదు.

ఓరోజు ఉదయం పదిగంటలకే ఆఫీసుకు వెళ్ళిన కమలాకరం పన్నెండుకల్లా యింటికి తిరిగి వచ్చేశాడు.

"ఏమిటండీ! ఏమి జరిగింది?" అంటూ పద్మావతి కంగారు పడిపోయింది.

"మరేం భయపడకు పద్మా! శుభవార్త చెప్పిపోదామని రెక్కలు గట్టుకుని యిలా రివ్వున వచ్చేశాను. మనకు ప్రమోషన్ వచ్చేసింది. ఆఫీసరుగారు స్వయంగా పిలిచి ఆర్డరు చేతికిచ్చారు" అంటూ కాగితాన్ని జేబులోనుంచి పైకి తీసి గాలిలో రెపరెపలాడించాడు కమలాకరం.

"నిజంగా?" కళ్ళు ఆకర్ణాంత విశాలాలైపోతుండగా ఆశ్చర్యంతో ప్రశ్నించింది పద్మావతి.

"నిజం, నిజం, నువ్వు తీరిగ్గా ఆశ్చర్యపడుతూ కూచో, నేను అయిదు అయిదున్నరకల్లా వచ్చేస్తాను" అంటూ కమలాకరం సైకిలుపైన తుర్రున వెళ్ళిపోయాడు.

పద్మావతి నిలువుటద్దం ముందు నిల్చుని తన సౌందర్యానికి తనే మురిసిపోయింది. ఆ తరువాత పెళ్ళయిన కొత్తలో జంటగా తీయించుకున్న ఫొటోను గుండెల కదుముకుని ఏదో మధురగీతిక పాడుకుంది. కుర్చీలో కూర్చుంది. ఈజీచేర్‌లో పడుకుంది. ఉండి వుండీ యిల్లు నలుమూలలా కలియతిరిగింది...

పది పదిహేను నిమిషాలిలా అవస్థపడిన తర్వాత - పట్టరాని ఆనందాన్ని, ఏనుగెక్కినంత సంబరాన్ని యిలా నాలుగు గోడల మధ్య కుదించి వుంచడం ఆమెకు దుస్తరంగా తోచింది - పద్మావతి ధనుర్యుక్తమైన బాణంలా రివ్వున వీధిలోకి వచ్చేసింది.

ఎదురింటావిడ సంచి చేతబట్టుకుని మెట్లు దిగి వీధిలో అడుగుపెడుతోంది.

"ఏమండీ పిన్నిగారూ! బజారుకు వెళ్తున్నారేమిటి?" అంటూ ఆప్యాయంగా పలకరించింది పద్మావతి.

"ఏం బజార్లోలే తల్లీ! మా బ్రతుకే బజారులా వుంది" అంటూ ఎదురింటావిడ ముఖం త్రిప్పుకుని విసవిస నడిచిపోయింది.

చింతనీళ్ళు చిలకరించినట్టుగా పద్మావతి ముఖం ముకుళించుకుపోయింది. కొండంత ఉత్సాహం నేలమట్టానికి అణగారిపోగా ఆమె గిరుక్కున వెనుతిరిగింది. అయ్యో, తను చేసింది చాలా ఘోరమైన పొరబాటు, తన యిష్టాయిష్టాలకు అనుగుణ్యంగా ఒకప్పుడు తనతో ప్రసక్తి కలిగించుకుని, మిగిలినప్పుడు దూరంగా వైదొలిగి వుండడానికి లోకులు తన చేతి కీలుబొమ్మలు గారు. వాళ్లు మైత్రి నెరపుతారు. కలహిస్తారు. అసూయపడతారు. గౌరవిస్తారు. పదిమందిలో తనూ ఒక్కతెగా మెలగదలచుకున్నంతవరకూ స్నేహమో, విరోధమో, అసూయో, గౌరవమో ఎప్పుడేది ఎదురైనా అప్పుడు దాన్ని స్వీకరించడానికి సిద్ధంగా వుండక తప్పదు. అలా కాదనీ తను లోకుల్ని తృణీకరిస్తే, వాళ్లు తన వ్యక్తిత్వాన్ని గుర్తించడానికే నిరాకరిస్తారు.

"అవును ఇప్పుడు నాకు విధింపబడిన శిక్ష యిదే!" అనుకున్నది పద్మావతి.

ప్రమోషను వచ్చిన పది రోజులకే కమలాకరం రేడియో కొన్నాడు. కంతుల మేరకు డబ్బు చెల్లించడానికి ఒప్పందమై మోటార్‌సైకిల్‌గూడా కొనుక్కున్నాడు. ఐతే రేడియోగానీ, మోటారుసైకిలుగానీ సంతృప్తినీ, సంతోషాన్నీ యింటి లోపలికి వెంట బెట్టుకురాలేకపోయాయి - సంతోషమూ, సంతృప్తీ డబ్బిస్తే బజార్లో దొరికే వస్తువులు గావు.

కమలాకరానికి ప్రమోషను వచ్చినమాట నిజమే! కానీ ఆ ప్రమోషను మూలంగా లభ్యం గావలసిన ఆనందం మాత్రం ఆకాశ కుసుమంలా అంతంత దూరంలోనే వుండిపోయింది. దీన్నే మరొక విధంగా చెప్పుకోవచ్చు - వ్రతం నెరవేరింది కానీ ఫలం మాత్రం దక్కలేదు.

***

అద్దె యింటికోసం మళ్లీ నాళంవారి వీధిలోనే అన్వేషణ ప్రారంభించిన కమలాకరం "ఇప్పుడున్న ఇంటికేమండి?" అని ప్రశ్నించిన పరిచితులందరికీ "అబ్బే, అది దయ్యాల కొంపండీ! రాత్రుల్లో గంగాళాలు దొర్లుతాయి. దాబాపైన రాళ్ళు పడతాయి. పెట్టిన వస్తువు పెట్టినచోట వుండదు" అంటూ దీనంగా ప్రత్యుత్తరమిచ్చాడు.

❖ ఆంధ్రపత్రిక - జూన్, 1958 ❖